

# దొరబాబు

రచన: "రాజ్‌పాల్"

ఇంక కోడలు ఓపిక పట్టలేక అత్తగార్ని అడిగేసింది—"ఎందుకండీ యిందాక టి నుంచీ కేకలు వేస్తున్నారు. గదిలో జడవేసు కుంటున్నా. కాస్సేపు ఆలస్యమైంది. అంతకీ యింత రాద్ధాంత మెందుకండీ" అని.

అత్తగారు అనుమానంతో వుండ బట్ట లేక అనేసింది "ఆ గదిలో కూచునే వేసు కోవాలా? యిల్లా వరండాలోకివచ్చి వేసుకో రాదూ" అని.

కోడలు అత్తగారికి సమాధాన మివ్వ దలచుకోలేదు. అత్తగారు ఎప్పుడూ అంటూ వుండే మాటలే అవి. అత్తగారు రుసరుస లాడుతూ వంటగదిలోకి వెళ్ళిపోయింది. కోడలు శారద, అత్తగారి మాటలకి లెక్క చెయ్యలేదు.

ఆరోజు సాయంకాలమే శారద అత్తగారి కోపం చల్లారడం చూసి అత్తగారితో అన్నది "వాళ్ల భుజంగరావు ఫస్టు క్లాసులో బి. ఏ. ప్యాసు అయ్యేడుట" అని.

అత్తగారు 'అల్లాగా' అని మాత్రం వూరుకుంది.

అంతటితో వూరుకోలేదు శారద— యింకా చెపుతూనే వుంది భుజంగరావు గురించి. అత్తగారు సహించలేక పోయింది. "త్వరగా వెళ్ళి కాఫీ కాచు—అబ్బాయి వచ్చే వేళ అయింది" అన్నది. రోజు రోజుకీ శారద విషయంలో అత్తగారి అనుమానం బలీయమై పోతోంది. అనలేక పోతోంది గట్టిగా కోడల్ని—వేరేవిధంగా.

అసలే అత్తగారు అనుమానంతో బాధ పడుతూంటే, దానికి తగ్గట్టే శారదా....పని మనిషీ ఏవో రహస్యాలు మాట్లాడు కుంటూ నవ్వుకోడం అత్తగార్ని మరింత వుద్రిక్త పరచింది.

ఒక రోజున శారద పనిమనిషితో

"భుజంగరావు దొరలా వుంటాడు కదూ ? ఎర్రటి శరీరం, వుంగరాల జుట్టు.....విశాలమైన ఛాతీ....కండలు తేలిన అవయవాలు నిజంగా దొరే కదూ !" అనడం అత్తగారు చెవులారా విన్నది. పనిమనిషి ఏదో అనబోతుండగానే అత్తగారు వెంటనే పని పురమాయించి పిలిచేసింది దానీదాన్ని. అత్తగారు ఆమాటలు విన్నదేమో అని శారద తబ్బిబ్బయిపోయింది. కానితన ధైర్యమే తన్ని గట్టిపరిచింది.

కాపరానికి వచ్చిన దగ్గరనుంచి కూడా శారదకు భుజంగరావుమీదే మక్కువ. భుజంగరావుని చూడకుండా శారద ఒక్క రోజన్నా వుండలేక పోతోంది. భుజంగరావుతో సంభాషణలు జరిపిన రోజులు కూడా లేకపోలేదు. కాని సమయంకోసం ఎదురు చూస్తున్నట్టుంది పాపం శారద!

భర్త రామారావుకి ఇరవై నాలుగ్గంటలూ ఆఫీసు కాగితాలు చూసుకోడంతోటే సరిపోతోంది. ఒక్క నిమిషమున్నా అతను శారదతో మాట్లాడ్డానికి వీలులేందే?

అత్తగారికోసం వచ్చిన అమ్మలక్కలంతా మీకోడలు నీళ్ళుపోసుకుంటా అని అడిగే వాళ్లే. అత్తగారు చాలా ఆప్యాయంగానే అంటూవుండేది—"అన్ని కోర్కెలు తీరేయ్ కాని ఒక్క దొరలాంటి మనుమడు పుడితే హాయిగా జీవితం వెళ్లబుచ్చుకుంటా. మరి ఆ కోర్కె ఎప్పటికి తీరుస్తాడో భగవంతుడు" అని.

శారదకు నవ్వొస్తూండేది అత్తగారి మాటలకి. మళ్ళీ శారద తనలో "ఒక్క దొరలాంటి కొడుకు పుడితే చాలు" అని అనుకునేది కూడా.

అనుకున్నట్టుగానే అత్తగారికి శారద విషయంలో అనుమానం ఎక్కువైంది. అత్తగారు తన తోడి అమ్మలక్కలతో వెళ్లబుచ్చుకుంది తన అనుమానం.

శారద ఎంతమాత్రం భయపడలేదు అత్తగారికి. రామారావుతో మాట్లాడవలసిన అవసరమే లేదు శారదకి. భుజంగరావు ప్రసంగం ఎత్తితే చాలు మండిపోతుంది అత్తగారు. ఏదోవిధంగా అతనిపేరు తలుస్తూనే వుంది శారద. ఆఫీసు కాగితాల్లో కరిగిపోయే రామారావుకి యీ విషయాలే వంటబట్టవ్!

రోజులు....నెలలు....గడిచిపోతున్నాయ్! యింక భుజంగరావు గురించి పైకి వర్ణించడం మానుకుంది శారద. లోపలమాత్రం శారద భుజంగరావు దొరని మరచిపోవటం లేదు. అత్తగారు అనుకుంది "శారద భుజంగరావుని మరచిపోయింది" అని. "బతుకు జీవుడా!" అనుకుంది అత్తగారే.

కోడలు కొడుకును ఎత్తుకుని పుట్టింటి దగ్గరనుంచి వచ్చింది. అత్తగారికి పూరంత ముఖమైంది.

"దొరలా వున్నాడమ్మా మాబాబు. దొరబాబే! నేటికి నాజన్మ తరించింది." అన్నది అత్తగారే. ఇరవై నాలుగ్గంటలూ మనుమణ్ని ఎత్తుకుని దింపటల్లేదు అత్తగారు.

తన స్నేహితురాళ్లతో చెప్పేసింది అత్తగారు తన కోడలు దొరలాంటి కొడుకును

కన్నదని. అంతా మురిసిపోయేరు దొరలాంటి కొడుకుని చూసి. ఇరవై నాలుగ్గంటలూ తనకళ్ల ఎదుటే వుండే దొరబాబులాటి కొడుకును చూస్తూ, భుజంగరావు పేరు ఎత్తవలసిన పనేలేక పోయింది.— వారదకు!

పనిమనిషి అడిగింది "అమ్మగారూ! మనుమడు తల్లిపోలికా కాదు....తండ్రి పోలికా కాదు మేనమామ పోలికేటీ" అని.

అత్తగారికి అనుమానం తళుక్కుమని మెరిసింది. అత్తగారిక్కి మనుమడిలో భుజంగరావు కనిపించేడు. కోపం వుబికింది పైకి. "తన కొడుకా నలుపు, కోడలా నలుపు! పోనీ రంగు ఎలావున్నా ఆకారమన్నా కలవలేదే తన కొడుకు కోడళ్లవి" అనుకుంది అత్తగారు లోలోపల. భుజంగరావు ముఖమే కనిపించింది మనుమడిలో. కోడల్ని కొరికెయ్యాలని పించింది అత్తగారికి. రుస రుసలాడింది అత్తగారు. మనుమడ్ని కిందపడెయ్యాలని పించింది. మళ్ళీ తన ముక్కునువూగించే మనుమడ్ని చూచేసరికి మనుమడ్ని పారెయ్యాలని పించలేదు అత్తగారికే. చక్కగా ముద్దొస్తున్నాడు దొరలాగ!

ఒక్కసారి తనమనుమడ్ని గట్టిగా ముద్దెట్టుకొని—పనిమనిషిని కేక లేసింది "ఎప్పుడూఅల్లాంటి అనవసర విషయాలు మాట్లాడకే" అని.



Edited and Published by Dhanikonda Hanumantha Rao at Abhisarika Offiec Tenali, & Printed by him at Sree Parasakti Printing Works, Tenali.